

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఎన్టీఆర్ కృష్ణా
శుక్రవారం 31 అక్టోబర్ 2025 పేజీలు 8


## నష్టపోయిన రైతులను
# అన్ని విధాల ఆదుకుంటాం

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్







**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను దెబ్బకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గురువారం నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డ, కోడూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,జిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర కార్మికులు, కర్మాగారాలు, మహిళలు బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు రాష్ట్ర గనులు ఎక్సైజ్ శాఖ భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్, రాష్ట్ర పర్యాటక అభ్యుదయం సీఈవో, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా తుఫాను ప్రత్యేక అధికారి కాటా ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మిగతా 2లో



2 లో

మునేరు వరద నేపథ్యంలో..
# అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం

**ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి & రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, వసంత వెంకట కృష్ణ ప్రసాద్, తంగిరాల సౌమ్యలతో కలసి మునేరు పరిశీలన**

**అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం**

**ప్రజలకు ఇబ్బందిలేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడి**

# నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

**యుద్ధ ప్రాతిపదికన పంటనష్టం అంచనా... పరిహారం చెల్లింపు**

**మీడియా సమావేశంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**నియోజకవర్గంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించిన మంత్రి అచ్చెన్నాయుడు**



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** మొంథా తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని అంచనా వేసామని, ఇందులో ఒక్క కృష్ణా జిల్లాలోనే 46వేల హెక్టార్లలో నష్టం కలిగిందనీ చెప్పారు. ఈ జిల్లాలో దాదాపు 56 వేల మంది రైతులు నష్టపోయారని ప్రాథమిక అంచనాకు వచ్చామన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకుంటామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. గురువారం పామర్రు నియోజకవర్గం పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ గ్రామంలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలసి పర్యటించిన మంత్రి అచ్చెన్నాయుడు మొంథా తుపాను వల్ల దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఆవేదన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత మూలంగా మొంథా తుపానును 2



మున్నేరు, కృష్ణా ప్రవాహాలపై
# నిరంతర అప్రమత్తత

**ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందుతుంది**

**రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ**

**ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

వివరాలు 7లో...

# నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్‌లతో కలిసి పర్యటించారు. తొలుత ఉప ముఖ్యమంత్రి కోడూరు మండలంలోని ఇస్మాయిల్ బేగ్ పేట ఆర్ సి ఎం చర్చ్ దగ్గర మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు.రైతులు కోట రామచంద్రరావు, రమేష్, వెంకటేశ్వరరావు లతో ముఖాముఖి మాట్లాడి దెబ్బతిన్న వరి పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కోట వెంకటేశ్వరరావ, రమేష్ మాట్లాడుతూ తాము ఆర్సీఎం చర్చి యాజమాన్యం నుండి కౌలుకు తీసుకొని 35 ఎకరాల్లో వరి పంట సాగు చేశామని, మొంథా తుఫాను కారణంగా విపరీతమైన ఈదురు గాలులు రావడంతో పంట మొత్తం నేలకు ఒరిగిపోయిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా పాలు పోయి పంట దెబ్బతిందన్నారు. వర్షపు నీరులో పంట మునిగిపోయిందని, నీరు ఎటు బయటకు పోలేకపోవడం వలన పంట మొత్తం కుళ్లిపోయే పరిస్థితి ఉందన్నా రు. ప్రతి సంవత్సరం ఇదే కాలంలో ఇలాగే నష్టం వాటిల్లుతుందని ఈసారి తుఫాను విపత్తుతో పూర్తిగా నష్టపోయామన్నారు. ఎకరా వరి పంట సాగు కోసం 40 వేల రూపాయలు ఖర్చు చేశామని, ఇప్పుడు దెబ్బతిన్న పంటను తీసివేయాలంటే కూలి ఖర్చులతో కలుపుకుని 30 వేల రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఇప్పుడు దెబ్బతిన్న పంట నుండి కేవలం 5 బస్తాలు ధాన్యం మాత్రమే వస్తుందన్నారు. ఇంకోసారి ఇలా జరగకుండా తగు ఏర్పాటు చేయాలని, మొలకల వడ్లు కూడా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆ రైతులు విజ్ఞప్తి చేశారు. నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. అనంతరం అవనిగడ్డ విద్యుత్ ఉపకేంద్రం వద్దకు వెళుతూ మార్గమధ్యలో దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎంత విస్తీర్ణంలో పంట వేశారు, ఎప్పుడు వేశారు రైతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు తోట కృష్ణమూర్తి మాట్లాడుతూ తాను 37 సెంట్లలో అరటి తోటలు వేసామని, తుఫాను గాలికి తోటలన్నీ నేల మట్ట మయ్యాయన్నారు. మొత్తం 350 అరటి మొక్కలు పూర్తిగా దెబ్బతిన్నాయని తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి వెంటనే స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

తదుపరి ఉపముఖ్యమంత్రి అవనిగడ్డ మండలంలోని విద్యుత్ ఉపకేంద్రం వద్ద జిల్లాలో మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు,



చెట్లు, విద్యుత్ స్తంభాలు, ప్రభావిత ప్రాంతాలపై ఏర్పాటుచేసిన ఛాయా చిత్ర ప్రదర్శనను పరిశీలించారు. ఈ పర్యటనలో ఉప ముఖ్యమంత్రి వెంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విజయలక్ష్మి, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివ నారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, అదనపు ఎస్పీ సత్యనారాయణ, పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకులు ప్రసన్నలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు, జిల్లా విద్యానాధికారి జే. జ్యోతి జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, మార్క్ఫెడ్ జిఎం మురళీ కిషోర్, డిటిడబ్ల్యు ఫణి ధూర్జటి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త సుధారాణి, వ్యవసాయ శాఖ ఏడి జయప్రద, తహసిల్దార్ కిరణ్మయి, మండల వ్యవసాయ అధికారి శ్రీధర్, సర్పంచ్ శ్రీ దుర్గా, మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, తదితర అధికారులు అనధికారులు పాల్గొన్నారు.

### మొంథా తుపాను ప్రభావ ఫోటో ప్రదర్శన పరిశీలించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

జిల్లాలో మొంథా తుపాను కలిగించిన నష్టం, ప్రభుత్వ సహాయక చర్యలను వివరిస్తూ గురువారం అవనిగడ్డ మండలంలోని అవనిగడ్డ విద్యుత్ ఉపకేంద్రం ఆవరణలో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన తుపాను ప్రభావ ఛాయాచిత్ర ప్రదర్శనను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక శాస్త్రం శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలించారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావం



చూపిన వ్యవసాయ, మత్స్య, విద్యుత్, ఇరిగేషన్, డ్రైనేజీ తదితర శాఖలకు సంబంధించిన నష్టాన్ని పరిశీలించారు. వివిధ పంటల నష్టం, రహదారులు, గృహాలపై కూలిపోయిన చెట్లు. విద్యుత్ స్తంభాలు వాటి తొలగింపు, మురుగు కాలువలకు గుర్రపు డెక్క తదితర అడ్డంకుల తొలగింపు, ప్రచార హోర్డింగుల తొలగింపు, సముద్రపు బోట్లను ఒడ్డుకు చేర్చడం, దెబ్బతిన్న బోట్లు, వలలు, సురక్షిత ప్రాంతాలకు గొర్రెలు, మేకలు, పశువుల తరలింపు, ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు ప్రజల తరలింపు వారికి భోజన వసతులు, వైద్య శిబిరాల ఏర్పాటు, తుపాను సంసిద్ధతపై ఉన్నతాధికారుల సమీక్షలు తదితర వివరాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉప ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులకు అంశాల వారీగా వివరించారు. ఉప ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, కృష్ణాజిల్లా ఇన్చార్జి మంత్రి రాష్ట్ర కార్మిక, కర్మాగారాలు, బాయిలర్లు, వైద్య బీమా సేవల శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మొంథా తుపాను జిల్లా ప్రత్యేక అధికారి కాట ఆమ్రపాలి, బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యుడు మండలి బుద్ధ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు, యువ నాయకుడు మండలి వెంకట్రామ్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మత్స్య, పశుసంవర్ధక, విద్యుత్, ఉద్యాన శాఖల అధికారులు అయ్యా నాగరాజా, చిన నరసింహులు, సత్యానంద్, జె జ్యోతి, డిపిఓ డాక్టర్ జె అరుణ, ఇరిగేషన్, డ్రైనేజీ తదితర శాఖల అధికారులు, కూటమి నాయకులు ఉన్నారు.

# నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం...

(మొదటిపేజీ తరువాయి)

సమర్థవంతంగా ఎదుర్కోగలిగామన్నారు. పక్కా ప్రణాళికతో నష్టం తీవ్రతను తగ్గించాం. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందు చూపు కారణంగానే తగినన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. వీడియో కాన్ఫరెన్సులు, ఆర్టీజీఎస్ ద్వారా 24 గంటలు పరిస్థితులను పర్యవేక్షిస్తూ.. అటు యంత్రాంగాన్ని, ఇటు గ్రామ స్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేశాం. ఈ విపత్తులో కౌలు రైతులు కూడా నష్టపోయారు, వారిని కూడా ఆదుకుంటాం అని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పంటలకు రూ.829 కోట్లు, ఉద్యాన రంగంలో రూ.39 కోట్లు, సెరీకల్చర్ రూ.65 కోట్లు, ఆక్వా రంగంలో రూ.1,270 కోట్లు, పశుసంవర్ధక శాఖలో రూ.71 లక్షలు నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 120 పశువులు చనిపోయాయని వివరించారు. త్వరలోనే నష్టం అంచనాలను తయారు చేసి కేంద్రానికి పంపిస్తామని స్పష్టం చేశారు. గతంలో తుఫాన్ ప్రభావం తగ్గిన వారం రోజుల వరకూ కోలుకునే పరిస్థితి ఉండేది కాదు. తుఫాన్లు, వర్షాలను ఆపలేం కానీ అప్రమత్తత, ముందస్తు చర్యలతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే అవకాశం ఉందని అన్నారు.

**రైతులకు తగిన న్యాయం చేస్తాం..** తుఫాన్ ప్రభావంతో చేతికొచ్చిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, వాణిజ్య పంటలు విస్తృతంగా నష్టపోయాయని పేర్కొన్నారు. రైతులకు తగిన న్యాయం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. వ్యవసాయ, హార్టికల్చర్ శాస్త్రవేత్తలను రంగంలోకి దించి, మిగిలిన పంటలను కాపాడేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయి సర్వే పూర్తవుతుందని, కేంద్రం సహకారంతో రైతులకు తగిన నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం కాలంలో 20 వేల రూపాయల నష్టపరిహారాన్ని 17 వేల రూపాయలకు తగ్గించిందని, అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ నష్టపరిహారాన్ని 20 వేల నుండి 25 వేల రూపాయలకు పెంచామని గుర్తుచేశారు. కేంద్రం నిర్ణయించిన దానికంటే అధికంగా పరిహారం అందజేస్తున్నామని చెప్పారు. రైతులు మళ్లీ పంటలు వేసేందుకు సిద్ధమైతే విత్తనాలను ప్రభుత్వం అందజేయడానికి సిద్ధంగా ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 95 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, మిగిలిన 5 శాతం కూడా నవంబర్ 12 లోపు పూర్తి చేస్తామని చెప్పారు. రైతులకు ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలనే సంకల్పంతో ఉన్నామని అన్నారు. ప్రతి గ్రామం, ప్రతి జిల్లాలో నష్టపోయిన పంటల వివరాలను న్యాయబద్ధంగా నమోదు చేయడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ముందస్తు ఆలోచనలతోనే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామనీ, కాని పంట నష్టం జరిగినదని తెలిపారు. బుడమేరు వరద బాధితులకు 15 రోజుల్లో పరిహారం అందజేశామని, రైతుల పట్ల ప్రభుత్వం



ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**జగన్ బహిరంగ చర్చకు రావాలి...** జగన్‌కు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే వ్యవసాయశాఖ తీసుకున్న అభివృద్ధి చర్యలు, కూటమి ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న మంచి కార్యక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని మంత్రి అచ్చెన్నాయుడు సవాలు విసిరారు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు వైసీపీ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన వ్యక్తిలా కాకుండా, అసంబద్ధ వ్యాఖ్యలు చేస్తున్నారంటూ అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వాటా భీమా నగదును చెల్లించలేదని స్వయంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి పార్లమెంట్‌లో వెల్లడి చేశారని గుర్తు చేశారు. ఇది జగన్ పాలన ఎంత అసమర్థమో చూపించే నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైసీపీ మాటలు తప్ప రైతులకు మేలు చేసిన పని ఏదీ లేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రంలో కూర్చొని వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడటం కాదని క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు గుడివాడ ఆర్డిఓ బాలసుబ్రమణ్యం, తహసిల్దార్ బి.శ్రీను నాయక్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఎస్.కవిత, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ సుధారాణి, డాక్టర్ రేవతి, ఉయ్యూరు చెరకు పరిశోధన స్థానం శాస్త్రవేత్త కె.లహరి, ఎండిఓ జె.విమాదేవి, మండల వ్యవసాయ అధికారి త్రినాధ ఆంజనేయరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జన్ను శోభన్ బాబు లతోపాటు పార్టీ నాయకులు సూరపనేని వెంకట సత్యనారాయణ, చలసాని రమేష్ చౌదరి, కూచిపూడి వెంకట సుబ్బారావు, కొసరాజు వెంకటేశ్వరరావు, నాదెళ్ల సుబ్రహ్మణ్యం, జక్కా శ్రీనివాసరావు, రాజులపాటి శ్రీనివాసరావు, మైనేని వెంకట నరేంద్ర, చింతపల్లి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా నాయకురాలు మైనేని ఇందిర తదితరులతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### మునేరు వరద నేపథ్యంలో

# అన్ని జాగ్రత్తలు చర్యలు తీసుకున్నాం

**విజయవాడ/కంచికచర్ల, మేజర్ న్యూస్ :** మునేరుకు వరద ఉధృతి పెరుగుతున్నందున ఆస్తి ప్రాణ, నష్టాలు సంభవించకుండా అన్ని చర్యలు చేపట్టామని ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. గురువారం సాయంత్రం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ లతో కలసి కీసర బ్రిడ్జి వద్ద మునేరు ప్రవాహాన్ని పరిశీలించారు. వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున పరిసర గ్రామాలు.. ముఖ్యంగా కీసర, పెండ్యాల, ఎస్. అమరవరం, వేములపల్లి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ గ్రామాల్లో ఇప్పటికే పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వరద కారణంగా ఆస్తి, ప్రాణనష్టాలు సంభవించకుండా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్ని చర్యలు చేపట్టారని, యంత్రాంగమంతా సన్నద్ధంగా ఉందని చెప్పారు. మొంథా తుపానును సమష్టి కృషితో సమర్థవంతంగా ఎదుర్కొన్నామని.. తెలంగాణలో కురిసిన వర్షాల వల్ల దిగువకు వరదనీరు పోటెత్తుతోందని.. ముందస్తు జాగ్రత్తలతో ప్రజలకు ఇబ్బందిలేకుండా చూస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల తహశీల్దార్ నరసింహారావు, డి.ఎస్.పి తిలక్, మండల వ్యవసాయ అధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ చల్లపల్లికి రావాలంటూ డిప్యూటీ సీఎంకు ఆహ్వానం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** దివిసీమ పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ను స్వచ్ఛచల్లపల్లి రథసారథులు డాక్టర్ డిఆర్కె.ప్రసాద్ డాక్టర్ పద్మావతి దంపతులు మోపిదేవిలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ డికె. బాలాజీ చొరవతో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దర్శనానికి వెళ్లి తిరిగివెళుతున్న పవన్ కళ్యాణ్ను వైద్యదంపతులు కలిశారు. గత 11 సం.లుగా చల్లపల్లి గ్రామంలో జరుగుతున్న స్వచ్ఛ సుందర చల్లపల్లి సేవలను తెలియచేశారు. ప్రభుత్వ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగిస్తున్నామనీ, ఒకసారి చల్లపల్లి గ్రామాన్ని సందర్శించాలంటూఆహ్వానపత్రాన్ని అందచేశారు. డిఆర్ కె దంపతుల ఆహ్వానానికి సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం తప్పకుండా చల్లపల్లికి వస్తానంటూ వారికి వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ, ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రభృతులు ఉన్నారు.

# క్యాన్సర్ నివారణకు సరైన నోటి ఆరోగ్యం



విజయవాడ, అక్టోబర్ 29, మేజర్ న్యూస్ : డాక్టర్ సోనియా దత్తా, ఎండిఎస్, పిహెచ్ డి పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ ప్రకారం, నోటి ఆరోగ్యం అంటే దంతాలు, చిగుళ్ళు మాత్రమే కాదు, మంచి నోటి ఆరోగ్యం కేవలం శుభ్రమైన దంతాలను కలిగి ఉండటం కంటే ఎక్కువ – ఇది మొత్తం శ్రేయస్సు యొక్క మూలస్తంభం. దంతవైద్యులు, వైద్యులు ఇద్దరూ నోటి–శరీర సంబంధాన్ని నివారణ సంరక్షణకు ముఖ్యమైనవిగా గుర్తిస్తున్నారు. ఆప్టిమల్ నోటి ఆరోగ్యం దైహిక ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది, గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని క్యాన్సర్‌ల వంటి పరిస్థితుల ప్రమాదాలను తగ్గిస్తుందిబీ, క్యాన్సర్ నివారణలో సవరించదగిన ప్రమాద కారకంగా ఇది ఎక్కువగా గుర్తించబడింది. తక్కువ రోగనిరోధక శక్తి ఉన్నవారికి, నోటి పరిశుభ్రతను నిర్వహించడం కేవలం సౌకర్యం గురించి కాదు. ఇది జీవిత నాణ్యతను నేరుగా ప్రభావితం చేస్తుంది. డాబర్ రెడ్ పేస్ట్ వంటి ఆయుర్వేద పేస్ట్‌తో రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం, ఫ్లాసింగ్, యాంటీ బాక్టీరియల్ మౌత్‌వాష్ ఉపయోగించడం వంటి సాధారణ అలవాట్లు బ్యాక్టీరియా భారాన్ని తగ్గించడం, నోటి పర్యావరణ వ్యవస్థను సమతుల్యంగా ఉంచడం ద్వారా ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గిస్తాయి. ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) పరిశోధకుల ప్రకారం, నోటి పరిశుభ్రతను ప్రామాణిక ఆంకాలజీ సంరక్షణలో విలీనం చేయాలి – సౌకర్యం కోసం మాత్రమే కాదు, మనుగడ ఫలితాలను మెరుగుపరచడానికి. మరో రుజువు ఇన్ హెన్స్ (ఇంటర్నేషనల్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ ఎపిడెమియాలజీ) కన్సార్టియం, ఇది మంచి నోటి పరిశుభ్రత (వార్షిక దంత సందర్శనలు, తక్కువ పళ్ళు కోల్పోవడం, రోజువారీ బ్రషింగ్) తల, మెడ క్యాన్సర్ ప్రమాదాన్ని నిరాడంబరంగా తగ్గిస్తుందని కనుగొంది. క్రమం తప్పకుండా దంత తనిఖీలు చాలా ముఖ్యమైనవిబీ ఆరోగ్యకరమైన దంతాలను నిర్వహించడానికి మాత్రమే కాకుండా నోటి క్యాన్సర్ యొక్క ముందస్తు హెచ్చరిక సంకేతాలను గుర్తించడానికి కూడా. దంతవైద్యులు అనుమానాస్పద గాయాలు, నిరంతర పూతల లేదా కణజాల ఆకృతిలో మార్పులను గుర్తించగలరు, అవి గుర్తించబడకపోవచ్చు. పొగాకును నివారించడం, మద్యం పరిమితం చేయడం వల్ల క్యాన్సర్ ప్రమాదం మరింత తగ్గుతుంది. ఈ చర్యలు కలిసి నోటి ఆరోగ్యాన్ని రక్షించడమే కాకుండా దీర్ఘకాలిక క్యాన్సర్ నివారణ వ్యూహాలలో శక్తివంతమైన సాధనాలుగా కూడా పనిచేస్తాయి, ముఖ్యంగా తల, మెడ క్యాన్సర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో.

**నోటి ఆరోగ్యం, కొన్ని క్యాన్సర్ల మధ్య సంబంధం:**

– తల, మెడ క్యాన్సర్లు: దీర్ఘకాలిక చిగుళ్ల వ్యాధి, నోటి పరిశుభ్రత సరిగా లేకపోవడం వల్ల నోరు, గొంతు, స్వరపేటికలో ప్రాణాంతకతలకు దారితీసే వాపు, సెల్యులార్ మార్పులు పెరుగుతాయి.

– జీర్ణవ్యవస్థ క్యాన్సర్లు: పీరియాంటల్ వ్యాధి కడుపు, ప్యాంక్రియాటిక్, కొలొరెక్టల్ క్యాన్సర్ల ప్రమాదాలతో ముడిపడి ఉంది.

– ఊపిరితిత్తుల, ప్రోస్టేట్ క్యాన్సర్లు: నోటి వ్యాధికారకాలు, ఈ క్యాన్సర్లకు దోహదపడే దంత వాపు మధ్య సంబంధం సూచించబడింది.

**ఇది అన్ని క్యాన్సర్లను నిరోధించకపోయినా, మంచి నోటి సంరక్షణ:**

– మ్యూకోసిటిస్, ఇన్ఫెక్షన్ల వంటి సమస్యలను తగ్గించడం ద్వారా క్యాన్సర్ చికిత్స ఫలితాలను మెరుగుపరుస్తుంది.

– రోగనిరోధక పనితీరుకు మద్దతు ఇస్తుంది, దైహిక వాపును తగ్గిస్తుంది.

– సాధారణ దంత సందర్శనల సమయంలో నోటి ప్రాణాంతకతలను ముందస్తుగా గుర్తించడానికి వీలు కల్పిస్తుంది.

**నోటి సంరక్షణ కోసం ఆచరణాత్మక చిట్కాలు:**

– డాబర్ రెడ్ పేస్ట్ వంటి ఆయుర్వేద పేస్ట్‌తో ప్రతిరోజూ రెండుసార్లు బ్రష్ చేయండి, క్రమం తప్పకుండా ఫ్లాస్ చేయండి.

– యాంటీ బాక్టీరియల్ మౌత్ వాష్ ఉపయోగించండి.

– పొగాకును నివారించండి, ఆల్కహాల్‌ను పరిమితం చేయండి.

– చక్కెర, ఆమ్ల ఆహారాలు, పానీయాలను పరిమితం చేయండి: ఇవి దంతాల ఎనామిల్‌ను క్షీణింపజేస్తాయి, బ్యాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తాయి.

– కనీసం సంవత్సరానికి ఒకసారి దంతవైద్యుడిని సందర్శించండి. సంకేతాలు, లక్షణాల గురించి తెలుసుకోండిబీ మీ నోటిలో ఏవైనా అసాధారణ గడ్డలు, పుండ్లు లేదా మార్పులు గమనించినట్లయితే, వెంటనే మీ దంతవైద్యుడిని సంప్రదించండి.

సరైన నోటి ఆరోగ్యం కేవలం దంత సమస్య మాత్రమే కాదుఇది ఒక దంత సంరక్షణ. ముఖ్యంగా భారతదేశం వంటి అధిక–బాధ ప్రాంతాలలో, ప్రాథమిక, ఆంకాలజీ సంరక్షణలో నోటి సంరక్షణను సమగ్రపరచడాన్ని నొక్కి చెప్పే తగినంత ఆధారాలు ఉన్నాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడానికి, మొత్తం ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడానికి సాధారణ దంత సందర్శనలు, పర్యవేక్షించబడిన బ్రషింగ్ కార్యక్రమాలు, ప్రజా అవగాహన ప్రచారాలు ఈ సమయంలో అవసరం.

## నవంబర్ 1న కురుమద్దాలిలోని
# రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో జాబ్ మేళా..
### నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
### జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజి



పామర్రు మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు నవంబర్ 1వ తేదీ శనివారం పామర్రు మండలం కురుమద్దాలిలోని రూరల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్(కమ్యూనిటీ హాల్)లో "జాబ్ మేళా" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో జపనీస్ ఎమ్ ఎన్ సి- ఎన్ ఎస్ ఇన్స్ట్రుమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అమెరికన్ ఎమ్ఎన్ సి – కోల్గేట్ పామోలివ్ లిమిటెడ్, ఫాక్స్కాన్ ఎం ఎఎన్ సి, టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, పివిఎస్ లాబొరేటరీస్ లిమిటెడ్, సంతోష్ ఆటోమోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫోస్పోర్ట్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసి, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, వరుణ్ గ్రూప్, శ్రీనివాస ట్రాక్టర్స్(ఎస్కార్ట్స్ లిమిటెడ్)వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని ఉపాధి అధికారి, డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డా. పి.నరేష్ కుమార్ తెలిపారు. ఈ కంపెనీలలో గల ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మసీ పూర్తిచేసిన 18 నుండి 35 సంవత్సరాల లోపు యువత అర్హులని, ఎంపిక అయిన వారికి వేతనము, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు కలవని, నవంబర్ 1న నిర్వహించబోయే జాబ్ మేళాకు హాజరయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా సదరు ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన తగిన అర్హతలు గల అభ్యర్థులు ముందుగా https://naipunyam.ap.gov.in/user-registration లింక్‌లో తప్పనిసరిగా తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ కావడంతోపాటు, సదరు జాబ్ మేళాకు రెజ్యూమ్ లతో లేదా బయోడేటా ఫోరమ్ లతో పాటు ఆధార్, ఆధార్ కు లింక్ అయిన ఫోన్ నంబర్, పాన్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 80743 70846, 96767 08041 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



## తాడంకి పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల మేజర్ న్యూస్ : మొంథా తుఫాన్ కారణంగా పమిడిముక్కల మండలం తాడంకి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సందర్శించారు. ఈ శిబిరంలో ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలు గురించి ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుని, ప్రాథమిక ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. అక్కడ వైద్యం సిబ్బంది అందిస్తున్న సేవలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తో కలిసి పునరావాస కేంద్రంలోని బాధితులకు బిస్కెట్లు పండ్లు పంపిణీ చేశారు. ప్రజలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని ఇటువంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమార్ రాజా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## మొక్కజొన్న పంట కోసం గోద్రేజ్ ఆగ్రోవెట్ నుంచి సరికొత్త కలుపు నివారిణి అషితాక

విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశంలోని ప్రముఖ విభిన్న వ్యవసాయ వ్యాపారాలలో ఒకటైన గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్, మొక్కజొన్న పంట కోసం ప్రత్యేకంగా రూపొందించిన కొత్త కలుపు నివారిణిని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఐఎస్‌కే జపాన్‌తో కలిసి అభివృద్ధి చేసిన 'అషితాక', భారతదేశంలోని మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన గడ్డి, వెడల్పు ఆకుల కలుపు మొక్కలపై సమర్థవంతమైన నియంత్రణను అందించే ఒక వినూత్న పరిష్కారం. మొక్కజొన్న పంటకు కలుపు మొక్కల బెడద ముఖ్యంగా ప్రారంభ దశల్లో ఒక పెద్ద సమస్యగా ఉంటుంది. అషితాకను 2 నుండి 4 ఆకుల కలుపు దశలో పిచికారీ చేస్తే, ఇది కలుపును చక్కగా నియంత్రిస్తుందని గోద్రేజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె. పేర్కొన్నారు.

## శామ్‌సంగ్ సొల్యూషన్ ఫర్ టుమారో 2025 విజేతల ప్రకటన




విజయవాడ మేజర్ న్యూస్ : భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, తన జాతీయవిద్యా కార్యక్రమం 'శామ్‌సంగ్ సాల్వ్ ఫర్ టుమారో 2025' నాల్గవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. ఈ కార్యక్రమం యువ విద్యార్థులు సాంకేతికతను వినియోగించి తమ స్థానిక కమ్యూనిటీల్లోని వాస్తవ ప్రపంచ సవాళ్లకు సృజనాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడానికిప్రోత్సహిస్తుంది. మొదటినాలుగు విజేత జట్లు, పెర్సెవియా (బెంగళూరు), నెక్స్ట్ ప్లే.ఏఐ (ఔరంగాబాద్), పారస్పిక్ (గురుగ్రామ్), పృథ్వీ రక్షక్(పలాము) ఐఐటి ఢిల్లీకి చెందిన ఫిట్ ల్యాబ్స్‌లో మెంటర్‌షిప్ మద్దతుతో, తమ ఆవిష్కరణాత్మక ప్రోటోటైప్ లను స్కేలబుల్ రియల్ వరల్డ్ పరిష్కారాలుగా అభివృద్ధి చేయడానికి రూ. 1 కోటి విలువైన ఇంక్యుబేషన్ గ్రాంట్లు అందుకున్నారు. జ్యూరీ ప్యానెల్‌లో శామ్సంగ్ నాయకత్వం, అలాగే విద్యా సంస్థలు, ప్రభుత్వం, పరిశ్రమల నిపుణులు పాల్గొన్నారు. ఈ ప్యానెల్ నాలుగు ప్రధాన నేపథ్య ట్రాక్‌లలో ఫైనలిస్టుల పరిష్కారాలను అంచనా వేసింది.

## జియో-బిపీ ఈవీ ఛార్జింగ్ సమీకృత మొబిలిటి కేంద్రం ప్రారంభం




విజయవాడ మేజర్ న్యూస్ : బెంగళూరులోని దేవనహళ్లి రిటైల్ అవుట్లెట్ లో 28 ఈవీ ఛార్జింగ్ పాయింట్లతో భారతదేశంలో మొదటి, అతి పెద్ద సమీకృత మొబిలిటీ కేంద్రాన్ని ప్రారంభించినట్లు జియో–బిపి ప్రకటించింది. ఇది దేశం పరిశుభ్రమైన, స్మార్ట్ ప్రయాణం దిశగా దేశ పరివర్తనలో ఒక ప్రధానమైన మైలురాయిని సూచిస్తుంది. దేవనహళ్లి అవుట్లెట్ బహుళ–ఇంధనం రిటైల్ సైట్. ఇది పెట్రోలు, డీజిల్, సీఎన్జీని అందించడమే కాకుండా, వైల్డ్ బీన్ కేఫ్. ఇది ఇప్పుడు ఆధునిక ఈవీ ఛార్జింగ్ వేదికను చేర్చింది. 360 కిలోవాట్ వరకు పంపిణీ చేసే 28 ఛార్జింగ్ పాయింట్లతో అత్యంత వేగవంతమైన డీసీ ఛార్జర్స్‌ను కలిగిఉంది. ఈ ఫ్లాగ్ షిప్ గమ్యస్థానం ఇంధనం, సీఎన్జీ, ఈవీ, రిటైల్, కేఫ్ అనుభవాలను ఒకే చోటకు తీసుకోవచ్చి, కస్టమర్లు, ప్రయాణికులకు ఒకే విధంగా సౌకర్యాన్ని పునర్నిర్వచిస్తోందని జియో–బిపి ఛైర్మన్ సార్థక్ బెహూరియా పేర్కొన్నారు.




## మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యూవీల కోసం 'శాంసంగ్ వాలెట్'లో డిజిటల్ కార్‌కీ సదుపాయం

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశపు అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్‌యూవీల కోసం శాంసంగ్ వాలెట్ ద్వారా డిజిటల్ కార్ కీ సదుపాయాన్ని అందిస్తున్నట్లు ప్రకటించింది. దీని ద్వారా మరింత మంది కార్ల యజమానులు తమ గెలాక్సీ స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించి తమ వాహనాలను అన్‌లాక్ చేయడానికి, లాక్ చేయడానికి, స్టార్ట్ చేయడానికి ఒక సజావైన మార్గాన్ని పొందవచ్చు. నేరుగా గెలాక్సీ పరికరాలలో (డివైసెస్‌లో) ఇమిడిపోయే (ఇంటిగ్రేటెడ్) శాంసంగ్ వాలెట్ 'డిజిటల్ కార్ కీ', భౌతికమైన కీ (ఫిజికల్ కీ) అవసరం లేకుండానే జత చేసిన వాహనాన్ని లాక్, అన్‌లాక్, స్టార్ట్ చేయడానికి వినియోగదారులను అనుమతిస్తుంది. అంతేకాకుండా, వినియోగదారులు తమ 'డిజిటల్ కార్ కీ'ని స్నేహితులు, కుటుంబ సభ్యులతో పరిమిత కాలానికి పంచుకోవచ్చు (షేర్ చేయవచ్చు), అవసరమైనప్పుడు యాక్సెస్‌ను నిర్వహించవచ్చు.

## చేనేత కార్మికుల పరామర్శించిన ఉప్పాల రాము



**పెడన,గుడూరు మేజర్ న్యూస్ :** మండలం కప్పలదొడ్డి గ్రామంలోని మొంథా తుపాను ప్రభావంతో చేనేత మగ్గాల్లోకి నీరు చేరి, వారం రోజులుగా ఉత్పత్తి కుంటుపడి గతంలో15 రోజులుగా భారీ వర్షాలతో పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులను వారి సమస్యలను తెలుసుకున్నమనీ దీని పై ప్రభుత్వం తో పోరాటం చేస్తామని వైసీపీ ఇంచార్జి ఉప్పల రాము అన్నారు. ఈ మేరకు కప్పలదొడ్డి గ్రామ చేనేత కార్మికులను కాలిసారు. ఈ సందర్భంగా తుఫానుకు పునరావస కేంద్రాల్లో ప్రజలకు ఇస్తున్నటువంటి మూడు వేల రూపాయల నగదు, బియ్యం చేనేత కార్మికులకు అందించటం తో పాటు నేతన్న నేస్తము 25000 కూడా వెంటనే ఇచ్చే ప్రయత్నం చేయాలని రెండు వందల యూనిట్ కరెంట్ సబ్సిడీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా కప్పలదొడ్డి గ్రామంలో ఉన్నటువంటి 5 చేనేత సహకార సంఘాల ముఖ్యులు ఈ కప్పలదొడ్డి గ్రామానికి ఉన్న ఇంచుమించు ఐదు కోట్ల బకాయిలు తక్షణమే ఇవ్వని ఎడల సంఘాలు ఉత్పత్తి పూర్తిస్థాయిలో కుంటుపడే స్థితికి రాబోవు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడమే కాదు మీకు లబ్ధి చేకూరేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు తాదితరులు ఉన్నారు.

## తుఫాన్ కష్టాల్లో మానవత్వం చాటిన రాము



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మొంథా తుపాన్ ప్రభావంతో మండల పరిధిలోని పెనుమత్స గ్రామంలో ఇబ్బంది పడుతున్న వృద్ధులకు గ్రామానికి చెందిన మొవ్వ రాము దాతృత్వంతో ఆహార పదార్థాలను సమకూర్చారు. అదేవిధంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలను పరామర్శించి ఆర్థిక సహాయం చేసారు. ఇది ఆయన మంచి మనసుకి నిదర్శనమని గ్రామస్తులు పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఇలాగే ఎన్నో కార్యక్రమాల్లో ముందుండి ప్రజలందరికీ సేవ చేస్తున్న మొవ్వ రాము కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపాశరు. గ్రామ ప్రజల యోగక్షేమాలను, సమస్యలను ఈ సందర్భంగా రాము అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో వినాయక స్వామి, కొడాలి మాధవ, నాగార్జున, సురేష్, జ్యోతి, వజ్ర లీల, సుందరభాగ్యం, కౌశిల్యమ్మ, కుమార్, దినేష్, కోటేశ్వరరావు, దేవ సహాయం, ఆదాం, నాగరాజు, జీవన్, చంద్రయ్య, వంశి తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి





**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని పామర్రు మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలా అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించి, పార్టీ నాయకులు, రైతులతో కలిసి తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. వర్షాలు, గాలుల కారణంగా పడిపోయిన వరి పైరును, అలాగే నేలకొరిగిన అరటి, బొప్పాయి తోటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న వైర్ కు ఎకరానికి 50 వేలు రూపాయలు వంతున ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు, గాలికి పడిపోయి నీట మునిగి పంట నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన ప్రతి ఎకరాకి రైతుకు 50 వేల రూపాయలు ప్రభుత్వం నేరుగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఈ ఏడాది కనీసం రైతులకు ఎరువులు కూడా పంపిణీ చేయకపోవడం వల్ల దళారుల దగ్గర అధిక రేటుకు ఎరువులు కొనుగోలు చేసి పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టడం జరిగిందని, అయితే ఈ వర్షాల వల్ల వరి పంట నేలకొరిగి నీట మునిగి పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు.

పంట పొలాలు నీట మునిగి రెండు రోజులు గడుస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు గాని, రెవెన్యూ అధికారులు గాని పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయడం లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు, పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజు కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా తక్షణం ప్రభుత్వ స్పందించి గ్రామాల్లో అధికారుల ద్వారా నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి పంట పోయిన ప్రతి ఎకరానికి రైతులకు నేరుగా నష్టపరిహారాన్ని అందజేయాలని కైలే అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కైలే అనిల్ కుమార్ తో పాటు మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, జడ్పిటిసి సభ్యులు జొన్నల రామమోహన్ రెడ్డి, పార్టీ నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలి



**పెడన, మేజర్ న్యూస్ :** మండల పరిది నందిగామ గ్రామం లో, గూడూరు మండలం పోసిన వారి పాలెం లో మోంథా తుఫాన్ ప్రభావంతో పంటలు తీవ్ర నష్టం చవిచూసిన పొలాలను సందర్శించి రైతాంగాన్ని పరామర్శించి, నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేసినట్లు నియోజకవర్గం వైసిపి ఇన్చార్జి ఉప్పాల రాము తెలిపారు. ఈ మేరకు నియోజవర్గం ఉప్పల్ గ్రామాలను విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతు తుఫాన్ వల్ల పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాల్సిన అవసరం ఉందని, రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన నియోజవర్గ రైతులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## శానిటేషన్‌లో నిమగ్నమైన గ్రామపంచాయతీలు



**మొవ్వ మేజర్ న్యూస్ :** మొంథా తుఫాను గ్రామాలను అతలాకుతలం చేసి వెళ్లిపోయిన అనంతరం పంచాయతీలు పరిశుభ్రతపై దృష్టి పెట్టాయి. మండల అభివృద్ధి అధికారిణి దయాల సుహాసిని, మండల ఇన్చార్జి ఈ.వో.పీ.ఆర్.డి.గా విధులు నిర్వహిస్తున్న మంత్రిపాలెం (రెగ్యులర్), కూచిపూడి (ఎఫ్.ఎ.సి), నిడుమోలు(ఎఫ్.ఏ. సి) కార్యదర్శి ఈడే వీర హనుమాన్ గౌడ్ ల ఆదేశాలతో గురువారం మండ లంలోని 21 గ్రామాలలో శానిటేషన్ క్లోరినేషన్ నిర్వహించారు. మండలంలో మేజర్ గ్రామాలైన మొవ్వలో కార్యదర్శి కేవీ సోమేశ్వరరావు, కోసూరులో ఎన్ శ్రీలక్ష్మి, కాజలో రాంబాబు, పెదపూడి, అయ్యంకి, భట్ల,పెనుమర్రు పెడసనగల్లు గ్రామాల కార్యదర్శి అయిన వి ప్రభు కుమార్, కూచిపూడి, మంత్రి పాలెం, నిడుమోలులలో హనుమాన్ గౌడ్ ల పర్యవేక్షణలో శానిటేషన్, లైట్లు వేయడం కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే మైనర్ పంచాయతీల్లో గ్రేడ్ 5 కార్యదర్శిల పర్యవేక్షణలోఈ కార్యక్రమాలు కొనసాగాయి.

# పూర్తిస్థాయిలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఎకరాకు 30 వేలు మెంతా తుఫాన్ ప్రభావంతో తీరప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం కొన్ని నిబంధనలను సడలించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె వి వి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. మండల పరిధిలోని శ్రీకాకుళంలో పడిపోయిన వరి పంటను కే వి వి ప్రసాద్ రైతు సంఘంతో గురువారం పరిశీలించి ఎంతో ఆవేదన చెందారు. ఈ మెంత తుఫాన్ రైతుల నడ్డి విరిచేసిందని అన్నారు. ఇప్పటివరకు ఎకరాకు 26 వేలు ఖర్చు పెట్టామని పడిపోయిన పంట గింజగా రాదని అన్ని తప్పలైపోతాయని రైతులు తమ గోడు విన్నవించు కుంటు న్నారన్నారు. ప్రతి రైతుకి పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించాలని అలాగే విత్తనాలు ఎరువులు నూరు శాతం సబ్సిడీపై ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పడిపోయిన వరి పంట ను కొయ్యటానికి యాంత్రికరణతో కుదరదని కేవలం మనుషులతోనే కోయించాలని, కాస్త ప్రభుత్వం ఆలోచించాలని ఆయన కోరారు. ఉపాధి హామీ పథకంను ఈ రైతులకు ఉపయోగపడేలా చేయాలని ప్రతి రైతుకు నష్టం జరగకుండా చూడాలని ఆ విధంగా అంచనాలు తీసుకొని తీసుకొని ప్రతి రైతుకు న్యాయం చేయాలని కోరారు. అలాగే వాణిజ్య పంటలకు వస్తే అరటి, కంద, పసుపు, చెరకు, పూర్తిస్థాయిలో తోటలు పడిపోయాయి, ఒక్కో ఎకరానికి 50,000 పైన ఖర్చు పెట్టి చేస్తే ఈ మంత తుఫాన్ ఈ విధంగా నష్టపరిచిందని, ఈ వాణిజ్య రైతులు కూడా పూర్తిస్థాయిలో ఆదుకోవాలని, పడిపోయిన పంటను తొలగించడానికి ఎకరానికి పదిహేను వేలు కచ్చితంగా అవుతుందని ఆ యాంత్రికరణ కూడా ప్రభుత్వం సిద్ధపరచాలని ఆయన కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రాష్ట్ర రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, అవనిగడ్డ నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్షులు వేమూరి రత్నగిరిరావు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు కోడి రాధాకృష్ణ, రైతు సంఘం ఉపాధ్యక్షులు కోడి శ్రీనివాసరావు, నియోజకవర్గ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కొల్లూరు శ్రీధర్ ప్రముఖ రైతులు గోగినేని రత్తయ్య చంటి తదితర రైతులు పాల్గొన్నారు

# మొంథా తుఫానుకు నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

**ఎకరానికి 30 వేల రూపాయలు చెల్లించాలి : రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రసాద్**



**మొవ్వ మేజర్ న్యూస్:** మొంథా తుఫాను వల్ల గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు, వేసిన గాలులకు చాప చుట్టాల పడిపోయి నీట మునిగిన వరి వైరుతో నష్టపోయిన రైతులనుతక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని, దిగుబడును తగ్గిపోయి నష్టపోయే రైతులకుఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారంప్రభుత్వం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవిపి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం మొవ్వ సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ పరిధిలోని ఘంటసాల చల్లపల్లి మండలాలలో ముంపు పొలాలను పరిశీలించడానికి విచ్చేసిన ఆయన ఫోన్లో మొవ్వ మండలం కూచిపూడి విలేకరితోకొద్దిసేపు మాట్లాడారు. మొవ్వ మండలంలోపడిపోయిన వరి పొలాలను, ముంపు పాలైన పొలాలకుసంబంధించిన వివరాలను సబ్ డివిజన్ సహాయ సంచాలకులు సూరపునేని శ్యామల నుంచి సేకరించారు. మొవ్వ మండలంలో 1,700 హెక్టారులలోవరి నేలకొరిగిన, నీటిపాలైనట్లు ఆమె వివరించారని తెలిపారు. మొంథా తుఫాను మూలంగా వేసిన విస్తృత గాలులకు, కురిసిన వర్షాలకు రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో సకాలంలో అవసరమైన ఎరువులు అందక అధిక రైతులతో కొనుగోలు చేసుకుని సాగు చేస్తున్న రైతులకు మునిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన, పొలాలు ఈనుతూ సుంకుపాలు పోసుకుంటున్న తరుణంలో కురిసిన అధిక వర్షాలకు తోడు మొంథా తుఫాను రావటంతో తీవ్ర నష్టాలపాలైన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ వర్షాల వల్ల వరి పంట నేలకొరిగినీటమునిగి పోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. పంట పొలాలు నీటమునిగిటంతోపాలు పోసుకుంటున్న కంకెలోతప్ప తాలు అధికమైమానుగాయ వచ్చే అవకాశాలు అధికంగా కనబడుతున్నాయ నిస్పష్టం చేశారు. రైతులు ఇప్పటికే ఎకరానికి 26 వేల రూపాయల వరకు పెట్టుబడిగా పెట్టారని మరొక నెల రోజులలో పంట చేతికివస్తుందనుకుంటున్న తరుణంలో దెబ్బతీసిన తుఫాను తో రైతు నడ్డి విరిగిందనిఈదశలో పంట నష్టం పరిహారంగా ఎకరానికి 30 వేల రూపాయల చొప్పున చెల్లించి ఆదుకోవాలని కోరారు.

అలాగే క్రాప్ ఇన్సూరెన్స్ సర్వే నెంబరు యూనిట్గా తీసుకొని సకాలంలో బాధిత రైతులకు అందించాలని పేర్కొన్నారు. అలాగే వాణిజ్య పంటలు, ఉద్యాన వన పంటలకు ఎకరానికి 50 వేల రూపాయలు చొప్పున అందించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో అధిక శాతం కౌలు రైతులే ఉన్నారని పంట నష్టపరిహారంను పొలం యజమానులకు కాకుండా కౌలు రైతులకే అందించి ఆదుకోవాలని సూచించారు. ఈ ఏడాది రైతులు అధిక శాతం ఎం.టి.యు 1061, ఎం టి యు 1318 సాగు చేశారని, తక్షణం ప్రభుత్వ స్పందించి గ్రామాల్లో అధికారుల ద్వారా నష్టపోయిన రైతులను, కౌలు రైతులను గుర్తించి పంట పోయిన ప్రతి ఎకరానికి రైతులకు నష్టపరిహారాన్ని అందజేయాలని ప్రసాద్ కోరారు.

# నేటిదిన పత్రిక సూర్య కథనంపై స్పందించిన పంచాయతీ అధికారులు





**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్:** విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలోని కుక్కలవాని కుంట చెరువులో గండినీ ఇసుక మూటలుతో, దానిపైన మట్టిని జెసిబి సహాయంతో పూడ్చటం జరిగింది. అలాగే ఎర్ర చెరువుకు గండిపడటంతో దానిని కూడా పూడ్చడం జరిగింది.ఈసంఘటన తెలిసిన వెంటనే మండల ఎమ్మార్వో బి.సుగుణ, ఎంపీడీవో విగ్గిన్స్ వచ్చి పూడికలను పర్యవేక్షించారు. ఇలాంటి సంఘటనలు మరల పునరావృతం కాకుండా రైతులకు,గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా సేవలు అందిస్తామని, ఇటువంటి ఘటనలు తెలిసిన యెడల మా దృష్టికి సకాలంలో తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శి అజేంద్ర చెప్పడం జరిగింది.

ఈ కార్యక్రమం లో గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మెన్ గూడవల్లి నరసింహరావు, జిల్లా ఉపాధ్యక్షు డు గుజ్జర్ల బాబురావు, మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డల రామారావు,గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ రామకృష్ణ, జెనసేనపార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల నాగశ్రీను, అన్నంశెట్టి నాగరాజు, బోర్డు డైరెక్టర్ సాతులూరి కోటేశ్వరరావు,సిద్దెల రాజా,దావు హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి అజేంద్ర వీఆర్వో రిజ్వానా బేగం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలి

**నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలి**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్**



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** ఆపద సమయంలో రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవివి.ప్రసాద్ డిమాండ్ చేశారు. మొందా తుఫాను కారణంగా దివి ఏరియాలో దెబ్బతిన్న పంటలను గురువారం రైతుసంఘం, సీపీఐల ఆధ్వర్యంలో రైతులతో కలిసి పరిశీలించారు. చల్లపల్లి మండలం రాముడుపాలెంలోవిరిగిపడిన అరటితోటలను పరిశీలించి రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేవివి.ప్రసాద్ మాట్లాడుతూ, పంటలు చేతికందివచ్చే తరుణంలో వచ్చిన విపతు బిలు రైతులకు కోలుకోలేని నష్టాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. వరితోపాటు అరటి, కంద, పసుపు తదితర వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఎకరాకు రూ.46వేల కౌలు చెల్లించేవిధంగా అరటితోటలు సాగు చేస్తున్నారనీ, ఇప్పటివరకూ సుమారు రూ.50వేలు పెట్టుబడి పెట్టారని తెలిపారు. తుఫాను గాలుల ప్రభావానికి అరటితోటలన్నీ నేలమట్టం అయ్యాయని వాపోయారు. ప్రభుత్వం పెద్దమనసుతో రైతులకు న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి రైతుల పరిస్థితులు, ఇబ్బందులను ప్రభుత్వం దృ ష్టికి తీసుకువెళ్లనున్నట్లు వివరించారు. వరి పంటలకు ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్బాబు మాట్లాడుతూ, అందరికీ అన్నం పెట్టే రైతన్న ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం ఉదారంగా స్పందించాలన్నారు. పంటనష్టం పరిశీలించేందుకు కోడూరు వచ్చిన ఉపముఖ్యమంత్రి రైతులకు ఎలాంటి భరోసా ఇవ్వకుండా వెళ్లిపోయారని విమర్శించారు. అధికారులు పంటనష్టాన్ని నిష్పక్షపాతంగా అంచనాలు తయారుచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నేతలు వేమూరి రత్నగిరిరావు, మల్లుపెద్ది బోసు, సీపీఐ నేతలు కొల్లూరి శ్రీధర్, దాసరి గోపాలకృష్ణలతోపాటు రైతులు పాల్గొన్నారు.

## నారాయణ స్కూల్లో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన

**స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్లో ఆకట్టుకున్న చిన్నారులు.**




**గన్నవరం, అక్టోబర్ 30, మేజర్ న్యూస్ :** గన్నవరం విద్యానగర్ లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఒకటవ తరగతి, రెండవ తరగతి విద్యార్థులు నిర్వహించిన స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. విద్యార్థుల నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో, వారు మొదటి సెమిస్టర్లో నేర్చుకున్న పాఠ్యాంశాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నైపుణ్య వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రజెంటేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు తమ పాఠశాల పాఠ్యాంశాలను చార్ట్ వర్క్లు, ప్రాజెక్ట్ వర్క్ల రూపంలో చూపిస్తూ, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు ధైర్యంగా సమాధానాలు ఇచ్చారు. తమ పిల్లల ప్రతిభ, ఆత్మవిశ్వాసం చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంత అద్భుతంగా పిల్లలను తీర్చిదిద్దడం ఒక్క నారాయణ స్కూల్ లోనే సాధ్యం అని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన పాఠశాల ప్రిన్సిపల్ షేక్ మస్తాన్ భాషా కి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ వాణీ, కోఆర్డినేటర్ లియోని, ఏ.జీ.ఎం. సత్తిరెడ్డ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## యన్ఆర్జిఎస్ నిధులతో గండ్రం రహదారి మరమ్మత్తులు



**పెడన/ గూడూరు, మేజర్ న్యూస్ :**తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు దెబ్బతిన్న గూడూరు మండలం గండ్రం-ముక్కొల్లు ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మహాత్మ గాంధీ జాతీయ ఉపాధిహామి నిధులతో రహదారి మరమ్మత్తు పనులు ప్రారంభించారు. స్థానిక అధికారులు పర్యవేక్షణలో గుంతలను మట్టి, గిట్టితో నింపి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామస్థులు తక్షణమే స్పందించిన అధికారులను అభినందించారు.

## డిప్యూటీ సీఎంకు పాతమాజేరులో రైతుల విజ్ఞప్తులు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** దివిసీమ పర్యటన ముగించుకుని తిరిగివెళుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు చల్లపల్లి మండలం పాత మాజేరులో రైతులు వరి కంకులతో స్వాగతం పలికారు. రైతులను చూసి కారు ఆపిన పవన్ వారికి అభివాదం చేశారు. తుఫాను ప్రభావంతో పాలుపోసుకునే దశలో ఉన్న వరిపంట దెబ్బతిందనీ, గాలులకు కంకులు రాలిపోయాయని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల చేతిలోని వరి పైరును చూసిన ఉప ముఖ్యమంత్రి ప్రభుత్వం ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. అధికారులకు తెలియచేసి రైతులను ఆదుకునేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భం గా ఉపముఖ్యమంత్రితో కరచాలనం చేసేందుకు మహిళలు, యువత ఉత్సాహం చూపగా, పలువురు సెల్ఫీలు దిగేందుకు, ఫొటోలు తీసుకున్నారు.

## లక్ష్మీపురం బీసీ కాలనీలో సీసీ రహదారి నిర్మాణం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** చల్లపల్లి మండల పరిధిలోని లక్ష్మీపురం బీసీ కాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రహదారి నిర్మాణం గురువారం జరిగింది. చల్లపల్లి జడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి భూమిపూజ చేసి రహదారి నిర్మాణపు పనులను ప్రారంభించి, పనులు పర్యవేక్షించారు. బీసీ కాలనీలో రహదారి నిర్మాణానికి కృషిచేసిన జడ్పీటీసీ దంపతులకు స్థానికులు కృ తజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెన్ఆర్సీ రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివప్రసాద్, మట్టా ప్రకాష్, బోలెం రంగారావు, బోలెం వెంకటేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్




**ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలి**

**31 నుంచి నవంబర్ 25 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు**

**కేంద్ర క్రీడలు యువజన సంక్షేమం మై భారత్ భారత్, కృష్ణాజిల్లా యువజన అధికారి సుంకర రాము**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్ 150 లో భాగంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రచార యాత్ర డిజిటల్ దశను ప్రారంభించటం గర్వంగా ఉందని కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము తెలిపారు. మచిలీ పట్నం స్థానిక కలెక్టర్ రేట్ పిజి ఎస్ ఆర్ హాల్ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా గురువారం జిల్లాలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మై భారత్ భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము మాట్లాడుతూ భారత చరిత్రలో ఇంతకు ముందెన్నడూ లేని విధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచారయాత్ర నిర్వహించడం జరగుతుందన్నారు. యువతలో ఐక్యత,దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు,జిల్లాలలో సర్దార్150 యూనిటీ మార్చ్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు. కృష్ణాజిల్లాలో పాదయాత్ర త్వరలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా భారత ఉక్కు మనిషిగా భారతీయ ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆయన చేసిన త్యాగాలను మరువలేమన్నారు. బిజెపి డిస్టిక్ జనరల్ సెక్రెటరీ పి రామాంజనేయులు మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిధ్యాలను ప్రతిబింబించే విధంగా పట్టణాలు, గ్రామాలలో ఈ నెల 31నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యోగా,ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ ప్రచార యాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన నిర్వహిస్తామని, స్వచ్ఛత డ్రైవ్ లు, మై భారత్ వాలంటీర్లు,ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్ ఎన్ఎస్ఎస్ యువత చురుకుగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఓ ఆనంద్ కుమార్,దుర్గా ప్రసాద్ కృష్ణా యూనివర్సిటీ ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మారుతి మేఘా షోరూమ్ ప్రారంభం





**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా మన జీవితాలను మలచుకోవాలని సీతామహాలక్ష్మి నర్సింగ్ హోమ్ అధినేత, ప్రముఖ డాక్టర్ దుట్టా రామచంద్రరావు అన్నారు. గురువారం ఉదయం హనుమాన్ జంక్షన్ లోని మారుతీ ఎలక్ట్రానిక్స్ మొబైల్స్ & ఫర్నిచర్స్ అధునాతనంగా ఏర్పాటు చేసిన నూతన మేఘా షోరూంను డాక్టర్ దుట్టా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతరానికి అనుగుణంగా అధునాతన టెక్నాలజీ తో ఎలక్ట్రానిక్ వస్తువులు సామాన్యులకు సైతం అందుబాటులో ఏర్పాటు చేసిన మత్తి రాంబాబు, కట్టా పవన్ కుమార్ లను ఆయన అభినందించారు.అలాగే ఎలక్ట్రానిక్ షోరూం ను గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సోదరుడు యార్లగడ్డ సతీష్ బాబు ప్రారంభించారు. ఫర్నిచర్ షోరూం ను స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ శ్రీదేవి దంపతులు ప్రారంభించారు. క్యాష్ కౌంటర్ ను పారిశ్రామిక వేత్త రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, పొట్లూరి ప్రసాద్ ప్రారంభించారు.మొబైల్స్ షోరూం ను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రారంభించారు. హోమ్ అప్లయన్స్ షోరూంను సామ్ సంగ్ కృష్ణాజిల్లా డిస్ట్రిబ్యూటర్ చుండూరి వేంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం మహిళలు జ్యోతి ప్రజ్వలన చేశారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన అతిథులను మారుతీ ఎలక్ట్రానిక్స్ మొబైల్స్ & ఫర్నిచర్స్ నిర్వాహకులు మత్తి రాంబాబు, శ్రీవాణి దంపతులు, కట్టా పవన్ కుమార్ తులసి రాణి దంపతులు అతిథులకు స్వాగతం పలికారు. 2004 ఏర్పాటు చేసిన మారుతీ ఎలక్ట్రానిక్స్ ను ఆదరించిన కస్టమర్లకు 20. సంవత్సరాల పురోగతిలో మారుతి ఎలక్ట్రానిక్స్ మొబైల్స్ & ఫర్నిచర్స్ మేఘా షోరూమ్ ఆదరించాలని నిర్వాహకులు కోరారు.

# నేటిదినపత్రిక సూర్య కథనానికి స్పందన

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో జన్మ భూమి రోడ్డు గురించి నేటిదిన పత్రిక సూర్యలో వెలువడిన ప్రకటనకు జిల్లా కూటమి నాయకులు స్పందించారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అంబాపురం గ్రామం లో రాజీవ నగర కట్టవరకు ఉన్న జన్మ భూమిరోడ్డును నేటిదిన పత్రిక సూర్యలో వచ్చిన కథనం ను చూసి కురిసిన వర్షాలకు రోడ్డు మరింత గుంతలు పడటం నీరు నిలిచిపోయేలా వుండటం చూసి సత్వర పరిష్కారం గురించి గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్తామని, అధికారులతో మాట్లాడి త్వరగా రోడ్డు పనులు జరిగేలాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లారు.పాములుకాలువలోకి వరద నీరు రావడం వలన పంటకాలువలోకి



గండి పడటం చూసి త్వరగా గండిపడిన కాలవగట్టుకు పూడిక వేయించమని అంబాపురం సర్పంచ్ సీతయ్యకు చెప్పటం జరిగింది. రైతులకి, గ్రామ




ప్రజలకు అన్ని విధాలుగా తెలుగుదేశం ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు,టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి బాబురావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు గొడ్డళ్ళ చిన్న రామారావు, రూరల్ తెలుగు మహిళా అధ్యక్షురాలు నెక్కంటి శ్రీదేవి, ఏఎంసి డైరెక్టర్ సాతులూరి కోటేశ్వరరావు, పి. నైనవరం టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు బెజవాడ రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి చప్పిడి రమేష్, సర్పంచ్ బట్టా చిన్నబాయి, అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య,రూరల్ తెలుగుయువత అధ్యక్షులు గంప శ్రీనివాస్ యాదవ్, అంబాపురం తెలుగుయువత అధ్యక్షులు చల్లగాలి సునీల్, దావు హనుమంతరావు,సిద్దెల రాజా పాల్గొన్నారు.



## వరద బాధిత కుటుంబాలకు ప్రత్యేక అధార్ క్యాంపు

**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని ముంథా తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఉన్న వరద బాధిత కుటుంబాలకు అధార్ కార్డు లేకపోవడంతో బాపులపాడు తహిసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకుని గుడివాడ ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లడంతో అయన అదేశాలు ప్రకారం ప్రత్యేక అధార్ క్యాంపు నిర్వహిస్తున్నారు. వీరవల్లి గ్రామంలోని ఏలూరు కాల్వ గట్ల పై డేరాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు వీరికి ఎన్నో ఏళ్ళ నుంచి అధార్ కార్డు నమోదు కాలేదు. మొత్తం నాలుగు కుటుంబాలు మొత్తం 14 మందికి అధార్ క్యాంపు ద్వారా కొత్త అధార్ ధృవీకరణ పత్రాన్ని పొందారు. కొత్త అధారు కార్డులను తహసిల్దార్ మురళీకృష్ణ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రంలో బాపులపాడు తహసిల్దార్ మురళీకృష్ణ, వీరవల్లి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కిరణ్మయి వీఆర్వో సునీల్ కుమార్,వీఆర్ ఏ కోటేశ్వరరావు,వెల్ఫేర్ అసిస్టెంట్ నన్నారావు,అధార్ అపరేటర్లు పాల్గొన్నారు.

## బొర్రపోతులపాలెం, బుద్ధాలపాలెంలలో పంట పొలాలు పరిశీలన



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** తుపాను కారణంగా నేల వాలిన వరి పైరును డా. ఎన్.వి.వి.స్.దుర్గా ప్రసాద్, వ్యవసాయ సహ పరిశోధన సంచాలకులు డా.వి.వి. రమణడీన్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్, డా.వి.సత్యప్రియ లలిత, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త.జె. యశ్వంత్ కుమార్, వ్యవసాయ అధికారి రామ్ కుమార్ తో కలిసి పంట పొలాలను బొర్రపోతులపాలెం, బుద్ధాలపాలెం గ్రామాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీయూ 1318, ఎంటీయూ 1262, బీపీటీ 5204 వరి రకాలు పూత, పాలుపోసుకునే దశలో ఉన్నాయన్నారు.నిలబడి ఉన్న పొలాల్లో తాలు గింజలు ఏర్పడే అవకాశం ఉందని, ధాన్యం రంగు మారకుండా, మానిపండు, మాగుడు తెగుళ్ళు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ రకాల వరి పడిపోతే పొలంలో నీటిని అంతర్గత కాలు వల ద్వారా తొలగించాలని సూచించారు.నిలబడి, పడిపోయిన పొలాల్లో గింజలు రంగు మారకుండా,తెగుళ్ల వ్యాప్తి నివారణకు ఎకరానికి 200 మి.లీ. చొప్పున ప్రొపికోనజోల్ పిచికారీ చేసుకోవాలన్నారు. నిలిచిన, పడిపోయిన వరి వంటలో కంకిలో మొలకలు కనపడితే పొలాల్లో నీరు బయటకు తీసేసి 5 శాతం ఉప్పు ద్రావణం 50 గ్రాముల కల్లు ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.తద్వారా మొలకెత్తడాన్ని,రంగుమారడాన్ని అరికట్టవచ్చున్నారు.

## మాజీ సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కడవకొల్లు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు గురువారం తాడేపల్లిలోని వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్‌లో మాజీ ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా దివిసీమలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, మొంథా తుపాను వల్ల సంభవించిన పంట నష్టం గురించి ఆయన వివరించారు. తుఫాను వలన దివిసీమ రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కొంటున్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కాలంలో ప్రభుత్వం స్వయంగా రైతుల పొలాలకు ఇన్సూరెన్స్ ప్రీమియంలు చెల్లించిందని, అందువల్ల పంటలు నష్టపోయినప్పుడు వారికి భరోసా లభించిందని జగన్ కి వివరించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇన్సూరెన్స్‌లు కట్టకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి నష్టపరిహారం అందని ద్రాక్షగా మారుతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిపించి రైతులకు న్యాయం చేసేలా కృషి చేయాలని జగన్ ని కోరినట్లు ఆయన చెప్పారు.అనంతరం అవనిగడ్డ నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, స్థానిక సమస్యలపై కూడా జగన్‌మోహన్‌రెడ్డికి నరసింహారావు వివరించగా, పార్టీని బలోపేతం చేయడంలో మరింత చురుకుగా పాల్గొనాలని జగన్ ఆయనను సూచించినట్లు సమాచారం.

# ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగింపు

## చెట్టు కొమ్మలను తొలగిస్తున్న టీడీపీ నేత ముని పోలిపల్లి





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసన సభ్యులు గద్దె రామమోహన్ ఆదేశాల మేరకు గురువారం 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఎన్నికల పోలింగ్ బూత్ ల యూనిట్ కన్వీనర్ ముని పోలిపల్లి ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ కారణంగా 17వ డివిజన్ పలు ప్రాంతాల్లో వేగంగా ఈదురు గాలుల వచ్చినందువలన చెట్లు కరెంటు తీగలు కలిసి ఉన్నచోట ప్రమాదకరంగా ఉన్నటువంటి చెట్టు కొమ్మలను నరికించి అవసరం ఉన్న చోట చెట్లను తొలగించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శానిటరీ సిబ్బంది మేస్త్రి వేల్పుల ప్రవీణ్, పార్క్ సిబ్బంది సూపర్వైజర్ ప్రకాష్ బాబు, నాగేశ్వరరావు సహకారంతో కంప్లైంట్ 1 రాణి గారి తోట, బాపనయ్య నగర్, చివర తారక రామా నగర్ మెట్లు ఆనుకొని ఉన్న చెట్టు కరెంటు స్తంభం పక్కపక్కనే ఉండటం వలన ప్రమాదకరంగా ఉన్నందున తీసివేయడం జరిగింది. పలుచోట్ల చెట్లు కొమ్మలు నరికించడం జరిగింది. కంప్లైంట్ 2. రాయవరపు అశోక్ ఇంటి వద్ద తారక రామా నగర్ లో కరెంటు తీగలు చెట్టు కలిపి ఉండటం వల్ల చెట్టు పడినట్టు అయితే స్థానికంగా ఉన్నటువంటి ఇంటిపైన పడే ప్రమాదం ఉన్నది కావున చెట్టు నరికే వలసిందిగా కోరుచున్నాము. కంప్లైంట్ 3) అవనపు శ్రీను ఇంటి వద్ద సర్వీస్ రోడ్డు తారక రామా నగర్ కట్ట పైన కాశమ్మ కంప్లైంట్ పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు ముని కృష్ణ, మొకర ఆదిబాబు, విజయవాడ తూర్పు నియోజకవర్గం టీఎన్టీయూసీ అధ్యక్షులు రాయవరపు అశోక్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు, కృష్ణా ప్రవాహాలపై నిరంతర అప్రమత్తత



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో/కంచికచర్ల, పెనుగంచిప్రోలు, అక్టోబర్ 30, మేజర్ న్యూస్ :** తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద పోటెత్తుతోందని.. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజేశేఖరబాబు.. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మున్నేరు వరద ఉధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు అటూఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెనువెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్హెచ్), ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్.. ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపా రు. వాహనాల రాకపోకలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ రహదారులకు సంబంధించి కూడా ప్రణాళికలు ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

**రైతులకు ప్రభుత్వం పూర్తి భరోసా:**

రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి కూడా వరద నీరు పోటెత్తుందోని.. ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువున, దిగువున ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు..



# సర్వమానవాళి కోసమే ఛఠ్ పూజ

**ప్రకృతి పర్యావరణ పరిరక్షణకు ఛఠ్ పూజలు**

**భవాని ఘాట్‌లో అంగరంగ వైభవంగా ఉత్తర భారతీయుల ప్రత్యేక పూజలు**

**లోక కళ్యాణం కోసం కృష్ణమ్మ హారతులు**





**విజయవాడ మేజర్ న్యూస్ :** సర్వమానవాళి,ప్రతి జీవి,దేశ ప్రజలు సుభిక్షంగా, సుఖఃసంతోషాలతో ఉండాలని,సూర్యభగవానికి పూజలు నిర్వహిస్తామని ప్రకృతి, పర్యావరణ పరిరక్షకు ఛఠీ పూజలు నిర్వహించడం చాలా అనందంగా ఉందని ఉత్తరభారతీయ సేవా సంఘం అధ్యక్షులు భావేష్ పాఠక్, ఉపాధ్యక్షుడు పంచానంద్ సా అన్నారు. స్థానిక భవాని ఘాట్‌లో ఉత్తరభారతీయ సేవా సమితి అధ్వర్యంలో బీహారీలు,డిల్లీ,ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలకు సంబంధించిన సుమారు 500వందల మంది భక్తులకు పైగా హాజరై భక్తి శ్రద్దలతో ప్రత్యేక స్నానాలు అచరించి,కృష్ణమ్మ వడిలో ఛఠ్ పూజా కార్యక్ర మాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరభారతీయ సేవా సమితి అధ్యక్షుడు భావేష్ పాఠక్ మాట్లాడుతూ దీపావళి తరువాత సూర్యభగ వానుడికి ఛఠ్ పూజ చేయడం అనావాయితి అని, పూజలు చేసేందుకు ఉపావాసదీక్షలతో భక్తి శ్రద్దలతో నిర్వహిస్తారు. మొదటి రోజు, రెండవ రోజు, చివరి రోజు అత్యంత కఠిన ఉపవాసదీక్షలు చేసి భక్తులు తమ భక్తిని చాటుకుంటారు. ఈ పూజాలో మొదటి గా సూర్యుడు అస్తమించే సమయం లో పూజలు ప్రారంభిస్తారు.రెండోవ రోజు ఉదయాన్నే ఈ ప్రపంచానికి వెలుగులు నింపే సూర్యభగవానుడు ఉదయించే సమయంలో వివిధ చాటలో రకాల పండ్లు, సుగంధద్రవ్యాలు సమర్పిస్తారు,నీటిలో మునిగి తమతమ కోరికలు కొరుకుంటారని వివరించారు.ప్రధానంగా ఈ పూజాలో సూర్యుని సోదరి అయిన ఛఠీ మైయా కి సకల నియమ,నిష్టలతో జపించి పూజలు నిర్వహిస్తారు. చాట్ పూజకి మూలం ఛఠీ మైయా గా అభివర్ణిస్తారు భక్తులు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఉదయ్ సా,సచ్చివ్ నివేష్ కుమార్,రాంబందన్ నిషాద్,రవిశంకర్ పండిట్,మనిష్ కుమార్,రాహుల్ కుమార్,మనిష్ కుమార్,పియాన్సు రాజ్, కన్నయ్యకుమార్,గిరిజేష్ కుమార్,రేఖదేవి,మున్నిదేవి తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు



**జి కొండూరు మేజర్ న్యూస్ :** రైతులెవరూ అధైర్య పడవద్దని, నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మొంథా తుఫాను వల్ల జరిగిన పంట నష్టాన్ని ఖచ్చితంగా అంచనా వేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. మైలవరం నియోజకవర్గంలో తుఫాను కారణంగా సంభవించిన వరదల వల్ల జరిగిన నష్టంపై వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా వరిపైరు చేతికి వచ్చే దశలో ఈ విధంగా నీటమునగటం చాలా బాధాకరం అన్నారు. అలాగే పత్తి కూడా వరుసగా వర్షాల నేపథ్యంలో రైతులకు చేతికి అందకుండా పోతోందన్నారు. వ్యవసాయ, ఉద్యానవన, వాణిజ్య పంటలు చాలా చోట్ల దెబ్బతిన్నాయన్నారు. దీనిపై ఖచ్చితంగా ఎన్యుమరేట్ చేసి నష్టం జాబితాలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. సీఎం చంద్రబాబు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చారని అన్నారు. కౌలు రైతులకు కూడా వారికే నష్టపరిహారం ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలుతీసుకుంటుందన్నారు. అలానే వరి, పత్తి పైర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పంట నష్టం తీవ్రత తగ్గించాలని ఆదేశించారు.

## చనిపోయిన రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం



**జి కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం గ్రామంలో మైనార్టీ సోదరుడు షేక్ జానీ, హరిజవాడకు చెందిన తొమ్మండ్రు మల్లేశ్వరరావు లు మంగళవారం అకాల మరణం చెందగా, తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్, టిడిపి శ్రేణులతో కలిసి ఒకవైపు మొంథా తుఫాన్ సహాయక చర్యలు చూస్తూ, మరోవైపు గ్రామంలో చనిపోయిన రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. చనిపోయిన రెండు కుటుంబాలని సందర్శించి, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి మృతదేహాల వద్ద నివాళులర్పించారుఈ సందర్భంగా మృతి చెందిన కుటుంబాలకు మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్ ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రటరీ దూరు బాలకృష్ణ, టౌన్ పార్టీ అధ్యక్షుడు కరీం దాదా, షేక్ బాజీ, మహమ్మద్ దత్తు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ సాగర్, షేక్ మస్తాన్, షాహినా బేగం, బీసీ నాయకులు బుడిపూటి వెంకటరావు, కోడి రెక్కల వెంకయ్య, నూతక్కి సతీష్, బుద్దే సుధాకర్,తొమ్మండ్రు ఎలిజర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగు యువత పాల్గొన్నారు.

## కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరిని సురక్షితమైన ప్రదేశాలకు తరలించండి

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరిని సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణవేణి ఘాట్, క్రోంబే రోడ్డు, హెచ్ బి కాలనీ, చిట్టినగర్ స్వరంగం, కే టీ రోడ్డు, నెహ్రు రోడ్డు, లో బ్రిడ్జ ప్రాంతాలన్నీ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ మొంథ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా నదీ పరివాహక ప్రాంతంలోని ఉపనదులలో ఆకస్మిక వరదలు సంభవించే అవకాశం ఉన్నందున, దానివలన కృష్ణ నదీ ప్రవాహం మరింత వేగంగా పెరిగే అవకాశం ఉనందున, కృష్ణా నది పరివాహక ప్రాంతాలలో, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలందరూ సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మొంథ తుఫాను ఈదురు గాలుల వల్ల రహదారులు, డ్రైన్లలో పైన పడిన వృక్ష కొమ్మలు, వృక్షాలు, ఆకులు తొలగించి రోడ్లు, డ్రైన్లు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. తదుపరి హెచ్. బి. కాలనీలో ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించి, త్రాగునీటి సరఫరా, వాడుక నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, తమ తమ అన్న క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, అన్న క్యాంటీన్లో వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకునే బాధ్యతను నోడల్ ఆఫీసర్లది అని అన్నారు.

# వరద నీరు నివాస ప్రదేశాలలో రాకుండా పటిష్టమైన చర్యలు





విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ : వరద నీరు నివాస ప్రదేశాలలో రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఉదయం కృష్ణానదిలో నాలుగు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువగా నీరు విడుదల చేసినందున, మొదటి హెచ్చరిక జారీ చేసినందున కృష్ణ నది పరివాహక ప్రాంతమైన రామ లింగేశ్వర నగర్, సాయిరాం కట్ పీసెస్, బసవతారక నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రామ లింగేశ్వర నగర్ రిటైనింగ్ వాల్ వద్ద నివసిస్తున్న ప్రజల నివాస ప్రదేశాలలోకి వరద నీరు రాకుండా ఉండేందుకు సాయిరాం కట్ పీసెస్, పోలీస్ కాలనీ, భూపేష్ గుప్తా నగర్, రణధీర్ నగర్, మెట్ల బజార్ ప్రాంతాలలో మోటర్ల ద్వారా నీరు రాకుండా చర్యలు తీసుకుంటు న్నామని చర్యలు తీసుకుం టున్నామని అన్నారు. సర్కిల్ 1 పరిధిలో భవానిపురం చేపల రేవు వద్ద రెండు మోటార్లను ఏర్పాటు చేసి వరద నీరు నివాస స్థలానికి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ వారు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు సురక్షితమైన ప్రదేశాలలో నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో వెళ్లాలని ప్రజలను కోరారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ కే షమ్మీ, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీ సర్ కె అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కే సంజయ్ రత్నకుమార్, సూపరింటెంట్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీరామ్ మోహన్ బాబు, ఈస్ట్ యం ఆర్ ఒ ఆర్. రోహిణి దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర కీలకం

## సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ ఎల్.స్వర్ణలత



విజయవాడ, మేజర్ న్యూస్ : ప్రభుత్వ కార్యాలయాలలో పనిచేసే మహిళా ఉద్యోగులు అధికారులు విధి నిర్వహణలో అందించే సేవలు ఎంతో కీలకం అని ప్రజలకు ప్రభుత్వానికి వారధి అయిన సమాచార పౌర సంబంధాల శాఖ లో అత్యంత సమర్థవంతంగా సేవలందించిన సూపరింటెండెంట్ ఎం.రూప వాణి, విజయవాడ రాష్ట్ర సమాచార కేంద్రం, లైబ్రేరియన్ గా పనిచేస్తున్న జాస్తి వెంకటలక్ష్మి పనితీరు అభినందనీయమని సమాచారశాఖ అదనపు సంచాలకులు ఎల్.స్వర్ణలత అన్నారు.ఈ నెల 31 న పదవి విరమణ చేయనున్న రూపవాణి, వెంకటలక్ష్మి లకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డైరెక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేసే మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఒక వైపు గృహిణిగా మరో వైపు ఉద్యోగిగా భాధ్యతలను అలుపెరగక నిర్వహిస్తారని అన్నారు దాదాపు 40 సంవత్సరాలుగా వెంకట లక్ష్మి 33 సంవత్సరాలుగా రూపవాణి వారి భాధ్యతలను నిర్వర్తిస్తూ తమదైన శైలిలో సేవ లు అందించిన ఇద్దరు మహిళా సిబ్బందికి పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తున్నాని తెలి పారు. వారి సేవలు నేటి తరం వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ప్రభుతవానికీ ప్రజలకు వారిది లా నిలిచే సమాచార శాఖలలో పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావించి ఉద్యోగులంతా సమర్థవంతంగా పనిచేసి మంచి పేరు సంపాదించాలని కోరారు. అనంతరం వెంకట లక్ష్మి ప్రసాద్ దంపతులను, రూపవాణిని సన్మానించారు.కార్యక్రమానిలో రాష్ట్ర సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ ఐ.సూర్యచంద్ర రావు డిప్యూటీ డైరెక్టర్లు బి.పూర్ణచంద్ర రావు వెంకట్రాజు గౌడ్, డి. రమేష్ భాస్కరనారాయణ ఎడిలు ఎస్ వి మోహన్ రావు, పి.రాజశేఖర్, ఎ.ఎస్ వీరభద్రరావు, ఎ.నారాయణరెడ్డి, డి ఐపిఆర్ఓ కె వి రమణ రావు, డిఎల్ పి ఆర్ ఓ కె.రవి, విశ్రాంత అధికారి ఎస్ శ్రీనివాస్ జీవన్ యితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తుపానుతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

**ప్రజలకు పూర్తి భరోసాగా ఉంటామని హామీ**

**వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్లు,విద్యుత్ వ్యవస్థను వీలైనంత త్వరగా పునరుద్ధరిస్తాం**

**రూరల్ మండలంలో విస్తృతంగా పర్యటించి సమస్యలు తెలుసుకున్న మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ**



మచిలీపట్నం మేజర్ న్యూస్ : తుఫానుతో పంట నష్టపోయి ఆందోళనలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు. మచిలీపట్నం రూరల్ మండలం లోని భోగిరెడ్డిపల్లె, యాదర, నెలకుర్రు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను ఆర్టీసీ చైర్మన్ కొనకల నారాయణరావుతో కలిసి పరిశీలించారు.



అనంతరం రైతులతో సమావేశమై పంట నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పరిశీలించారు. అక్కడ ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి, సమస్య ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.వర్షాలతో గ్రామాల్లో రోడ్లు,విద్యుత్ లైన్లు, డ్రైన్లు దెబ్బతిన్నాయని తెలియజేయడంతో వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా చిన్న సన్నకారు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం నుంచి కావాల్సిన మేరకు పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అధికారులు కూడా పంట నష్టం అంచనా విషయంలో ఉదారంగా వ్యవహరించాలని సూచించారు. తుఫాను పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు, అధికారులంతా అప్రమత్తమై ప్రాణనష్టాన్ని పూర్తిగా అడ్డుకున్నప్పటికీ పంట నష్టాన్ని అడ్డువయమకోలేకపోయాం. కానీ పరిహారం విషయంలో ఉదారంగా న్యాయం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులకు 90% వరకు నష్టపరిహారం దక్కేల చూస్తానన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూడా ఇప్పటికే తుఫాన్ ప్రభావతి ప్రాంతాల్లో ఏరియల్ సర్వే చేశారని, పరిహారం విషయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి ఉదారంగా ఉన్నారన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, కాగిత వెంకటేశ్వరావు, లంకె నారాయణ ప్రసాద్, పిప్పళ్ళ కాంతతరావు, తదితరులు పాల్గొన్నారు.



## మున్నేరు వరద ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి, ఎంపీ



జగ్గయ్యపేట, మేజర్ న్యూస్ : జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్.. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురామ్ తదితరులతో కలిసి వత్సవాయి మండలం, చిట్యాల వద్ద లింగాల వంతెన వద్ద మున్నేరు వరద ప్రవాహాన్ని పరిశీలించారు. మున్నేరులో గంట గంటకు వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇరిగేషన్, రెవిన్యూ, పోలీస్, పం చాయతీరాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నార న్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే జాగ్రత్తగా ఉండాలని, అధికారులు, సిబ్బంది చేస్తున్న సూచనలను పాటించాలని తెలిపారు.

## రాష్ట్ర సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ : కంకిపాడు లో రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కంకిపాడు లోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు అయాన్ కన్వెన్షన్ సెంటర్ కు రానున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు తో కలిసి ముందస్తు భద్రత ఏర్పాట్లను ఏ ఎస్ ఎల్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 31వ తేదీ సాయంత్రం అయాన్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రయాణించే రోడ్డు మార్గంలో రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ సూచించారు ఈ పర్యటన లో జిల్లా కలెక్టర్ ఎస్పీ వెంట సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, ఎస్పీ సత్యనారాయణ, ఉయ్యూరు ఆర్డీఓ బివిఎస్ హేలా షారోన్, డిపిఓ డాక్టర్ జై అరుణ, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, సహాయ ఫుడ్ కంట్రోలర్ గోపాలకృష్ణ, ఎస్ ఎస్ జి డి ఎస్ పి ఆర్ పి ఎల్ శాంతి కుమార్, ఇంటెలిజెన్స్ డిఎస్పి మురళీధర్, గన్నవరం డిఎస్పి శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఈఈ నవీన్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ బలరాం, కంకిపాడు తహసీల్దారు భావనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.


**విలేకరులు కావలెను**

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు: ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999